క్లుప్తంగా

లంబో'ధర'
రూ.1,11,111 పలికిన లడ్డూ


రమణారెడ్డికి లడ్డూను అందజేస్తున్న నిర్వాహకులు

షాద్‌నగర్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లిలో హనుమాన్ గణేశ్ మండల్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన లంబోదరుని లడ్డూ రికార్డు ధర పలికింది. నిర్వాహకులు వినాయక నిమజ్జనంలో భాగంగా లడ్డూ వేలం పాటను నిర్వహించారు. వేలం పాటలో లడ్డూ రూ.111111లకు చటాన్‌పల్లికి చెందిన పబ్బతి రమణారెడ్డి దక్కించుకున్నాడు. అనంతరం విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు చేసి గంగమ్మ ఒడికి తరలించారు.

ఆలయాల నిర్మాణాలకు పూజలు
కొత్తూరు: కొత్తూరు పట్టణంలో పునర్ నిర్మిస్తున్న ఆలయాలకు ఆదివారం స్థానికులు ప్రత్యేక పూజలు చేశారు. ఏర్పలమ్మ భవిష్య వాణి చెప్పింది. పట్టణంలో ఉన్న తొమ్మిది ఆలయాలను పునర్‌నిర్మించడానికి స్థానిక నాయకులు రాజకీయాలకు అతీతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే చందాలతో పాటు సొంతంగా నిధులు ఇవ్వడానికి దాతలు ముందుకు వస్తున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

బీజేపీలో చేరికలు


బీజేపీలో చేరిన తండావాసులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం గోవులబండతండా, చింతకుంటతండాల్లో వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరారని ఆ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు కుర్మయ్య తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు విష్ణువర్ధన్‌రెడ్డి , శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించినట్లు ఆయన పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో దశరథ్, రెడ్యానాయక్, చందర్, కిషన్, రవి, సేవ్యానాయక్. గోపాల్, శాంతాబాయి, శిరీష తదితరులు ఉన్నారు.

కలిసి కట్టుగా సమస్యలు పరిష్కారం
సర్పంచ్ శైలజ


యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభించిన శైలజ, నాయకులు

చేవెళ్ల: కార్మికులంతా కలిసి కట్టుగా ఉంటనే సమస్యలను పరిష్కారమవుతాయని చేవెళ్ల సర్పంచ్ బండారి శైలజ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో సెంట్రింగ్ యూనియన్ కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని సెంట్రింగ్ కార్మికులంతా కలిసి ఒక యూనియన్‌గా ఏర్పడి కార్యాలయం ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమన్నారు. భవనిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులంతా కలిసి కట్టుగా ఉంటేనే పనులు అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో సివిల్ ఇంజనీర్లు మహేశ్, కరుణాకర్‌రెడ్డి, నాయకులు ఆగిరెడ్డి, సెంట్రింగ్ యూనియన్ మండల అధ్యక్షుడు ఎండి. ముస్తాఫ, ఉపాధ్యక్షుడు డి. కృష్ణ, కార్యదర్శి చంద్రమౌళి, సంయుక్త కార్యదర్శి ఎండీ. పాష, ట్రేజరర్ మహేశ్, సభ్యులు జె.నర్సింలు, అజమ్, పాష, రాఘవేందర్, శేఖర్, రాంరెడ్డి, వెంకటయ్య, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములుకండి


పనులు ప్రారంభిస్తున్న దశరథ్‌నాయక్

కడ్తాల్: గ్రామాల అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ కోరారు. మండలంలోని రావిచేడ్ గ్రామంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో మంజూరైన డీఎంఎఫ్ నిధులతో నిర్మిస్తున్న శాలివాహన భవన నిర్మాణ పనులను ఆదివారం జెడ్పీటీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, రైతుబంధు జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, ఉప సర్పంచ్ వెంకటేశ్, నాయకులు బాలకృష్ణ, రమేశ్‌యాదవ్, విఠలయ్యగౌడ్, పవన్ ఉన్నారు.

గ్రామాలకు సుస్తీ

- పల్లెల్లో విజృంభిస్తున్న జ్వరాలు
- మండలాల్లో పెరుగుతున్న జ్వరపీడితులు
- ముందు జాగ్రత్త చర్యలు కరువు

షాబాద్: జిల్లా వ్యాప్తంగా జ్వరాల విజృంభిస్తున్నాయి. మారుమూల గ్రామాల్లో ఎక్కడ చూసినా ఇంటింటా జ్వరపీడితులే దర్శనమిస్తున్నారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుద్ధ్యం లోపించి దోమలు విజృంభణ కొనసాగుతోంది. ఇళ్ల మధ్య ఖాళీ ప్రదేశాల్లో నిలిచిన నీటిలో దోమ లార్వా వృద్ధి చెంది సీజనల్ జర్వాలకు కారణం అవుతున్నాయి. నీటి నిల్వ వల్ల దోమల సంతతి వేగంగా వృద్ధి చెంది డెంగీ, మలేరియా వ్యాధుల వ్యాప్తి చెందుతున్నాయని అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులపై అవగాహన లేకపోవడం, ముందు జాగ్రత్త చర్యలు కరువవడంతోనే జ్వరపీడితుల సంఖ్య పెరుగుతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పొంచి ఉన్న డెంగీ ముప్పు

పది రోజులుగా జిల్లాలో రోజురోజుకు జ్వరపీడితుల సంఖ్య పెరుగుతోంది. గతేడాది జిల్లా వ్యాప్తంగా డెంగీ కేసులు ఎక్కువగా నమోదు కాగా, ఈ సీజన్‌లో తక్కువ శాతం డెంగీ కేసులు నమోదయ్యాయి. కొంత మంది రోగులకు మలేరియా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అధికారికంగా రిపోర్టు కాని కేసులు సంఖ్య రెట్టింపుగా ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు డెంగీ పేరుతో రోగుల నుంచి రూ.వేలల్లో బిల్లులు వసూలు చేస్తున్నారు. ఆయా ఆస్పత్రులపై వైద్యశాఖ అధికారుల పర్యవేక్షణ కరువైందన్న ఆరోపణలున్నాయి. జ్వరం వచ్చాక ప్లేట్‌లేట్ కౌంట్ తగ్గడం, డెంగీ స్ట్రిప్ టెస్ట్, సిరమ్ టెస్ట్ వంటి వాటితోనే డెంగీ వచ్చిందని కొందరు ప్రైవేటు వైద్యులు చెబుతున్నారు. అలా కాకుండా విధిగా ఐజీఎం పరీక్ష ద్వారానే డెంగీని నిర్ధారించుకోవాలని వైద్యశాఖ అధికారులు సూచిస్తున్నారు.

ప్రాథమిక ఆస్పత్రులకు పెరిగిన ఓపీ..

మండల కేంద్రాల్లోని ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రులకు వస్తున్న రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. గత నెలలో ఆస్పత్రులకు వచ్చిన అవుట్‌పేషంట్ల సంఖ్య రోజుకు వంద మంది వరకు ఉండగా పదిరోజులుగా 150కి పైగా ఓపీ నమోదవుతోంది. వీరిలో అధికశాతం జ్వరం, సీజనల్ వ్యాధులు లక్షణాలతో వస్తున్నావారే ఉన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ప్రైవేట్ ఆస్పత్రులు కూడా రోగులతో కిటకిటలాడుతున్నాయి. చాలా వరకు ఆర్ఎంపీ, పీఎంపీల చికిత్సతోనే సరిపెడుతున్నారు.


తాళ్లపల్లి రోడుపై నిలిచిన వర్షపు నీరు

జ్వరం తగ్గడం లేదు



నేను ఐదు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నా.. ప్రైవేటు ఆస్పత్రిలో చూపించుకున్నా. వైరల్ ఫీవర్ వచ్చిందని, మందులు ఇచ్చినా తగ్గడం లేదు. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య నెలకొంది. ఎవరి ఇంట్లో చూసినా జ్వరంతో బాధపడుతున్నారు. వర్షాకాలంలో అధికారులు పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి.

– రాజమణి, షాబాద్

అప్రమత్తంగా ఉండాలి



జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధ్యులు వస్తున్నాయి. ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి. చుట్టుపక్కల పరిసరాల్లో దోమల ఉధృతి పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. ప్రభావిత గ్రామాల్లో వైద్య సిబ్బందితో శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం. రోగులకు రక్త పరీక్షలు చేస్తున్నాం.

– డాక్టర్ దామోదర్, డీప్యూటీ డీఎంహెచ్‌ఓ

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం
కేశంపేట: మండలంలోని నిర్దవెళ్లి గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను కేశంపేట ఎస్ఐ బీఎస్ఎస్ వరప్రసాద్ ఆదివారం సన్మానించారు. ఇటీవల బీహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిని 35 రోజుల క్రితం హత్య చేసి గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో పాతిపెట్టారు. పోలీసుల విచారణలో శవం వెలికితీసేందుకు గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు నర్సింలు, జంగయ్య, మల్లయ్యలు చేసిన సహకారానికి ఎస్ఐ బీఎస్ఎస్ వరప్రసాద్ నగదు రివార్డుతో పాటు శాలువతో వారిని సన్మానించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాములు, కానిస్టేబుల్స్ శివకుమార్, రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.


పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎస్ఐ వరప్రసాద్

కార్మికుల సంక్షేమానికే పోరాటం
సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్

షాబాద్: సీఐటీయూ కార్మికుల సంక్షేమానికి నిరంతరం పోరాటం చేస్తోందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్, తాళ్లపల్లి సర్పంచ్ పెంటయ్య పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని తాళ్లపల్లిలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమానికి పాలకవర్గాలపై పోరాటం చేస్తూనే, కార్మికుల హక్కులను సాధించిందన్నారు. కార్మికుల సంక్షేమం కోసం సీఐటీయూ ముందుండి పోరాటం చేస్తుందని చెప్పారు. ఆరుకోట్ల 20లక్షల మందితో దేశంలో అతిపెద్ద కార్మిక సంఘంగా పేరు ఉందని చెప్పారు. కార్యక్రమంలో తాళ్లపల్లి ఉపసర్పంచ్ విజయ, మాజీ ఉపసర్పంచ్ బాస నర్సింహులు, మండల నాయకులు నర్సింహా, గ్రామ పంచాయతీ యూనియన్ మండల అధ్యక్షుడు సత్తయ్య, ఉపాధ్యక్షుడు నర్సింహా, లక్ష్మయ్య, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, కార్మికులు తదితరులు ఉన్నారు.


సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న దేవేందర్, పెంటయ్య తదితరులు

బోధకాల వ్యాధిగ్రస్తుడికి ఆర్థిక సాయం
చేవెళ్ల: ఆపదలో ఉన్న పేదలకు ప్రతి ఒక్కరు తమ వంతు సహాయం అందించాలని ఎంపీపీ ఎం. విజయలక్ష్మి తనయుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆలూరు గ్రామంలో ఆదివారం బోధకాల వ్యాధితో బాధపడుతున్న చనిగల నర్సింహులుకు లక్షరూపాయల అర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తోటి వారికి సహాయం అందించాలన్నారు. పేదరికంలో ఉన్న వారికి వ్యాధులు వస్తే వారి కుటుంబానికి భారంగా మారతుందని అన్నారు. అలాంటి వారికి అందరూ కలిసి సహకారం అందిస్తే బాధిత కుటుంబానికి అండగా నిలిచిన వారమవుతామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రమణారెడ్డి, తోట చంద్రశేఖర్, యాదమ్మ, నరేందర్‌చారి, నర్సింలు, అంజనేయులు, షాబాద్ శ్రీనివాస్, రవికుమార్, గ్రామస్తులు ఉన్నారు.

సొంత నిధులతో విద్యుత్ స్తంభాల ఏర్పాటు

మండలంలోని దామరగిద్దలో ఎంపీపీ ఎం. విజయలక్ష్మి సొంత నిధులు రూ. 4లక్షలతో విద్యుత్ స్తంభాల పనులు చేపట్టారని సర్పంచ్ ఎం. వెంకటేశం గుప్తా తెలిపారు. గ్రామంలో విద్యుత్ స్తంభాల సమస్యను పలుమార్లు విద్యుత్ అధికారులకు చెప్పినా వారు పట్టించుకోలేదని తెలిపారు. దీంతో ఎంపీపీ దృష్టికి తీసుకుపోవటంతో తన సొంత నిధులతో సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారని చెప్పారు.


నర్సింహులుకు ఆర్థిక సహాయం అందజేస్తున్న డాక్టర్ వైభవ్‌రెడ్డి

పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట
ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని కంసాన్‌పల్లి, వెంకట్‌రెడ్డిపల్లి, గిరాయిగుట్ట తండా, పుల్చర్లకుంట తండాల్లో రూ.1.41కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక పల్లెలు అన్ని రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధిస్తున్నాయని అన్నారు. జాతీయ స్థాయిలో గ్రామ పంచాయతీలు అభివృద్ధిలో పోటీపడి అవార్డులు సొంతం చేసుకుంటున్నాయని తెలిపారు. పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తోందని చెప్పారు. గ్రామ పాలనను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకొచ్చిందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బసిరెడ్డి పద్మ, మాజీ వైస్ ఎంపీపీ బసిరెడ్డి నరేందర్‌రెడ్డి, మండల పార్టీ అద్యక్షుడు లక్ష్మణ్ నాయక్, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం

షాద్‌నగర్ మున్సిపాలిటీలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాత జాతీయ రహదారి పక్కన పారిశుద్ధ్య పనుల కార్యక్రమం ప్రారంభించారు. పట్టణంలోని ఎస్‌జీఓఎస్ కాలనీలో రూ.10లక్షలతో నిర్మించిన పార్కు కాంపౌండ్ వాల్‌ను ప్రారంభించారు. అలాగే, రూ.10లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ నటరాజన్, విశ్వం, పావని, నర్సింహ్మా, చింటు, యుగేందర్, నందకిషోర్, కమిషనర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడపగడపకూ కాంగ్రెస్'
కడ్తాల్: మండల పరిధిలోని న్యామతాపూర్ గ్రామంలో సోమవారం ఉదయం గడప గడపకు కాంగ్రెస్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీ చంద్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండావిష్కరణ కార్యక్రమంతో పాటు, పార్టీ ప్రకటించిన 6 గ్యారంటీ స్కీంలను ప్రజలకు వివరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు

మంత్రి సత్యవతి, కవితకు కృతజ్ఞతలు


మంత్రి సత్యవతిరాథోడ్‌ను కలిసిన మినీ అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు


ఎమ్మెల్సీ కవితను కలిసిన మినీ అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర, జిల్లా కమిటీల నేతలు

చేవెళ్ల: మినీ అంగన్‌వాడీలను ప్రధాన అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్ చేసినందుకు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ కవితను మినీ అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం నగరంలోని వారి నివాసాల్లో కలిసిన రాష్ట్ర, జిల్లాల కమిటీల నాయకురాలు పూలబొకేలు అందజేశారు. ఈ సందర్భంగా మినీ అంగన్‌వాడీల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు భారతిలు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 3989 మంది మినీ అంగన్‌వాడీలకు మహర్దశ కల్పించారన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ పాలనలో మినీ అంగన్‌వాడీలు ప్రధాన అంగన్‌వాడీలుగా మారడంతో వారి కష్టాలు తీరాయని తెలిపారు. కేసీఆర్‌కు ప్రభుత్వానికి రుణపడి ఉంటామని చెప్పారు. సహకరించిన ఎమ్మెల్సీ కవిత, మంత్రి సత్యవతి రాథోడ్, కమిషనర్ భారతి హోళీకేర్‌లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మినీ అంగన్‌వాడీ యూనియన్‌కు చెందిన వివిధ జిల్లాలకు చెందిన నాయకురాళ్లు సునీత, నాగరాణి, కవిత, శ్రీలత, వినోద, విమ్మ, జ్యోతి తదితరులు ఉన్నారు.

విగ్రహావిష్కరణకు రండి


మంత్రి మహేందర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: ఈ నెల 26వ తేదీన (మంగళవారం) వీరవనిత ఐలమ్మ జయంతి సందర్భంగా అజీజ్‌నగర్‌లో ఐలమ్మ నూతన విగ్రహ ఆవిష్కరణ చేయనున్నట్లు గ్రామ వెంకటేశ్వర రజక కో–ఆప్షన్ సంఘం అధ్యక్షుడు యాదగిరి పేర్కొన్నారు. ఆదివారం సంఘం సభ్యులతో కలిసి నగరంలో మంత్రులు సబితారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డితో పాటు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మండల ప్రజాప్రతినిధులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. విగ్రహ ఆవిష్కరణకు మంత్రులతో పాటు ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని మంగళవారం ఉదయం 10 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. రజక సంఘం సభ్యులతో పాటు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మంత్రులను కలిసిన వారిలో అజీజ్‌నగర్ వార్డు సభ్యులు మౌనిక, మల్లేష్, పెంటయ్య, మల్లేష్, బాబు తదితరులున్నారు.

పూజలందుకోవయ్యా..
గణపయ్యా

గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వరుడు విశేష పూజలను అందుకుంటున్నాడు. ఆదివారం షాద్‌నగర్, చేవెళ్లలోని ఆయా గ్రామాల్లో గణనాథుల మండపాల వద్ద అన్నదానం నిర్వహించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని భక్తులు వేడుకున్నారు. భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తిని చాటుకున్నారు. పలు చోట్ల శాంతియుతంగా గణనాథులను నిమజ్జనం చేశారు.


చేవెళ్లలోని అయ్యప్ప ఆలయంలో గణపతిహోమాలు నిర్వహిస్తున్న భక్తులు


చేవెళ్ల: ఎమ్మెల్యే యాదయ్యకు జ్ఞాపికను అందజేస్తున్న గ్రామస్తులు



షాద్‌నగర్‌రూరల్: పూజలో పాల్గొన్న శ్రీనివాస్, తదితరులు


మొయినాబాద్‌రూరల్: మెల్‌బోర్న్ సిటీలో గణనాథుడికి ప్రత్యేక పూజలు


షాబాద్: పూజలు చేస్తున్న ఎంపీటీసీ చెన్నయ్య దంపతులు, తదితరులు


షాద్‌నగర్: పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు


మొయినాబాద్‌రూరల్: ప్రత్యేక పూజలో పాల్గొన్న మంజులరవియాదవ్

ప్రభాకర్‌కు మూల భారత్ భీమ్‌రత్న అవార్డు
చేవెళ్ల: బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం 33 ఏళ్లగా పోరాటం చేస్తున్న చేవెళ్లకు చెందిన అంబేద్కర్ అవార్డు గ్రహీత బురాన్ ప్రభాకర్‌ను మూల భారత్ భీమ్ రత్న అవార్డుతో సత్కరించారు. మండల కేంద్రంలో రెండు రోజులుగా జరుగుతున్న ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా 5వ మహాసభ ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సభలో అంబేడ్కర్, జ్యోతిబా పూలే. సావిత్రిబాయి పూలే ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న వ్యక్తిగా బురాన్ ప్రభాకర్‌ను గుర్తించి అతని సేవలకు అవార్డు అందజేస్తున్నట్లు ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం జాతీయ కో ఆర్డినేటర్ వరుణ్‌కుమార్, ప్రముఖ అంబేడ్కర్ వాది పీ.ఎస్.ఎస్ మూర్తిలు అన్నారు. ఇలాంటి వ్యక్తులు అరుదుగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం సలహాదారులు జి. శంకర్, పీపుల్స్ ఎడ్యూకేషనల్ ట్రస్ట్ చైర్మన్ సీహెచ్ బాలకృష్ణ, భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం ప్రభాకర్, అసోసియేటెడ్ ప్రొఫెసర్ పట్టా వెంకటేశ్వర్లు, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకుడు దేశమొళ్ల అంజనేయులు, ఏఐఏవైఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వినయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు రాజు, సంఘం నాయకులు ప్రభాకర్, రవీందర్, జయకృష్ణ, టి. ప్రవీణ్, వినోద్‌కుమార్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.


ప్రభాకర్‌ను సత్కరిస్తున్న సంఘం నాయకులు, ప్రముఖులు